



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

ఎన్టీఆర్ కృష్ణా

శుక్రవారం 13 ఫిబ్రవరి 2026

పేజీలు 8


## సేంద్రియ సాగుతో..

# డబుల్ ధమాకా!

- ఇటు రైతుకు, అటు వినియోగదారులకూ మేలు
- ఆరోగ్యకర వ్యవసాయ ఉత్పత్తులతో సుస్థిర ఆదాయం
- మామిడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- రాయితీపై ఫ్రూట్ కవర్లు పంపిణీ
- ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**రెడ్డిగూడెం, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్ :** వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ పద్ధతులను అవలంబించడం ద్వారా అటు రైతులకు, ఇటు వినియోగదారులకు 'డబుల్ ధమాకా' లాంటి మేలు జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ తిరువూరు ఆర్డీవో కె.మాధురితో కలిసి రెడ్డిగూడెం మండలం, రంగాపురం గ్రామంలో పర్యటించి, మామిడి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పీవో) అభ్యుదయ రైతులతో మాట్లాడి ఫ్రూట్ కవర్ల వినియోగం, ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా మామిడి కాయలకు ఫ్రూట్ కవర్లు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ

మిగతా 2లో





2లో

## గవర్నర్ ప్రసంగం 'విజన్ 2047'కు మార్గదర్శకం

అసెంబ్లీలో ఎమ్మెల్యే యార్లగడ్డ



2లో

మూడవ జోన్ ఆయకట్టుకు

## సాగర్ జలాలు విడుదల చేయాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే వసంత



2లో

## రోడ్లు, వంతెనల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే కుమార్ రాజా

భక్తుల భద్రత, సౌకర్యాలపై

## ప్రత్యేక దృష్టి



- మహా శివరాత్రి సందర్భంగా అప్రమత్తంగా ఉండాలి
- అధికారులు పటిష్ట సమన్వయంతో పనిచేయాలి
- ఎగ్జిబిషన్లకు డెయిలీ ఫిట్‌నెస్ చెకింగ్ రిజిస్టర్ ఉండాల్సిందే
- అత్యంత నాణ్యంగా అన్న, ఇతర ప్రసాదాలు అందించాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

8

## ఆర్ముడు రిజర్వ్ పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఫైరింగ్ ప్రాక్టీస్

వివరాలు 8 లో



క్రీడలలో ఉత్సాహం ఉంటే

5లో

## చదువులోనూ రాణింపు సాధ్యం



### మూడవ జోన్ ఆయకట్టుకు
## సాగర్ జలాలు విడుదల చేయాలి



**మైలవరం, మేజర్ న్యూస్ :** నాగార్జునసాగర్ ప్రాజెక్టు మూడో జోన్ పరిధిలోని ఆయకట్టుకు తక్షణమే సాగర్ జలాలు విడుదల చేయాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో గురువారం ఉదయం జీరో అవర్లో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ సాగునీరు లేక మైలవరం నియోజవర్గ రైతులు పడుతున్న అవస్థలను అసెంబ్లీలో ప్రస్తావించారు. సాగునీటి సమస్యలను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఎన్.ఎస్.పి మూడవ జోన్ కు 14 టీ.ఎం.సీల నీరు కేటాయించగా ఇప్పటివరకు కేవలం 1.6 టీ.ఎం.సీల నీరు మాత్రమే విడుదల చేశారన్నారు. మూడవ జోన్ పరిధిలో సాగుచేస్తున్న మొక్కజొన్న, తదితర ఆరుతడి పంటలకు నీరు అత్యవసరం అన్నారు. సాగునీటి విడుదల కోసం కిందిస్థాయి అధికారులు తెలంగాణా అధికారులతో మాట్లాడితే స్పందించడం లేదన్నారు. వారికి అవసరం లేనప్పుడు మాత్రమే నీటిని దిగువకు విడుదల చేస్తామని చెబుతున్నారని, మన రాష్ట్రానికి అవసరం అయినప్పుడు సాగునీటిని విడుదల చేయడం లేదన్నారు. ఈ యేడాది సమృద్ధిగా వర్షాలు కురిసి, రిజర్వాయర్లు అన్నింటిలో నీళ్లు ఉండి కూడా సకాలంలో సాగునీటిని సరఫరా చేయకపోతే అది మన వైఫల్యమేనన్నారు. రైతులు వేసిన పంటలు కాపాడుకోవాలంటే వరుసగా 10 రోజుల పాటు నిరంతరాయంగా నీళ్లు ఎన్.ఎస్.పి మూడవ జోన్ కు విడుదల చేయాలని అన్నారు. ఈ విషయంలో మంత్రి నిమ్మల రామానాయుడు తెలంగాణ మంత్రితో పాటు, ఉన్నతాధికారులతో మాట్లాడి సాగునీటిని విడుదల చేయించాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు కోరారు.

## రోడ్లు, వంతెనల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



**పామర్రు మేజర్ న్యూస్ :** నియోజకవర్గ పరిధిలో శిథిలావస్థకు చేరిన వంతెనలు, ఆర్ అండ్ బి రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా అసెంబ్లీలో విన్నవించారు. శాసనసభ సమావేశాలలో భాగంగా గురువారం సభలో ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఆర్ అండ్ బి రోడ్లు, జిల్లా పరిషత్ రోడ్లు ఎక్కువగా ఉన్నాయని, పూర్తిగా శిథిలావస్థకు చేరిన ఈ రోడ్లను సంక్రాంతి లోగా బాగు చేస్తామని ప్రకటించినా నిధులు పూర్తిస్థాయిలో మంజూరు కాకపోవడంతో చేయలేకపోయామన్నారు. జిల్లాలోనే ఈ నియోజకవర్గం విస్తీర్ణపరంగా పెద్దదిగా ఉండటం వల్ల ఆర్ అండ్ బి, జిల్లా పరిషత్ రోడ్లు ఎక్కువగా ఉన్నాయన్నారు. అందువల్ల తమ నియోజకవర్గానికి ఎక్కువ నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఈ రోడ్లను పట్టించుకోకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రజలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఇప్పటివరకు కేవలం 50శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయని, మిగిలిన నిధులను కూడా ఉగాదిలోగా మంజూరు చేయటం ద్వారా రోడ్ల మరమ్మతులకు చేయూతనివ్వాలని కోరారు. అలాగే నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే మూడు వంతెనలు కూలిపోగా తాత్కాలిక ఏర్పాట్లు చేశామని, వాటికి పూర్తిస్తాయిలో నిధులు మంజూరు చేయాలని కోరారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెనలు ఈ నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నాయని, దీంతో ఆ వంతెనలు శిథిలావస్థకు చేరడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ వంతెనల స్థానంలో నూతన వంతెనల నిర్మాణానికి, అలాగే ఆర్ అండ్ బి, జిల్లా పరిషత్ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలని ఆయన సభాముఖంగా ప్రభుత్వాన్ని కోరారు.

### నారా లోకేష్‌కి విద్యార్థుల కృతజ్ఞత ర్యాలీ

**విజయవాడ మేజర్ న్యూస్ :** మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటర్ దగ్గర నుంచి మదర్ తెరిసా సెంటర్ వరకుటీఎన్ఎస్ఎఫ్ఆధ్వర్యంలో నారా లోకేష్‌కి కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి పెండింగ్లో ఉన్న రూ. 1200 కోట్లను విడుదల చేసి రాష్ట్రంలో పేద విద్యార్థుల కష్టాలను అర్థం చేసుకొని, వారికి అండగా నిలిచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి విద్యాపట్ల నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని విద్యార్థుల తరపున విద్యార్థుల తల్లిదండ్రుల తరపున మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతగా ఈ కృతజ్ఞతా రాలిని నిర్వహించారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ విజయవాడ సెంట్రల్ అధ్యక్షుడు బంగారు సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# సేంద్రియ సాగుతో డబుల్ ధమాకా!







(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ మామిడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫ్రూట్ కవర్లు వల్ల ఎలాంటి మచ్చ లేని, మంచి రంగుతో పరిమాణంలో మామిడి దిగుబడి ఉంటుందన్నారు. హెక్టారుకు 15 వేల కవర్లను 50 శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇలాంటి మామిడికి మార్కెట్లో మంచి రేటు ఉంటుందని, వినియోగదారులకు కూడా మంచి నాణ్యమైన ఆరోగ్యకర పండ్లు లభిస్తాయన్నారు. నిమ్మకాయ సైజులో కాయ ఉన్నప్పుడు కవర్ కట్టడం వల్ల పండ్ల ఈగలు, ఇతర కీటకాలు కాయను ఆశించలేవని.. దీనివల్ల రైతుకు పురుగుమందుల ఖర్చు బాగా తగ్గుతుందని, రసాయన అవశేషాలు లేని పండ్లు ఉత్పత్తి అవుతాయని వివరించారు. మామిడి రైతులు కూడా 100 శాతం ప్రకృతి సేద్య విధానాలను అనుసరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. జిల్లా అధికార యంత్రాంగం కృషితో ప్రభుత్వం మామిడి సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు మామిడి రైతులు ధన్యవాదాలు తెలియజేశారు. మామిడి రైతులకు ఇబ్బంది కలిగిస్తున్న కోడి పేనుపై దృష్టిసారిస్తున్నామని, శాస్త్రవేత్తల సహకారంతో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ ప్రసంగం 'విజన్ 2047'కు మార్గదర్శకం



**గన్నవరం, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్ :** అసెంబ్లీ లో రెండో రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ అసెంబ్లీలో కీలక ప్రసంగం చేశారు. గవర్నర్ ప్రసంగం కేవలం ఒక ప్రకటన కాదని, అది 'విజన్ 2047' దిశగా రాష్ట్రం సాగాల్సిన స్పష్టమైన మార్గదర్శకమని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో నెలకొన్న అంధకారం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కిస్తూ, కేవలం 20 నెలల్లోనే రూ.4,498 కోట్ల విద్యుత్ బకాయిలను చెల్లించడంతో పాటు విద్యుత్ ఛార్జీలను తగ్గించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రానికి 13.25 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 16 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా అడుగులు పడుతున్నాయని వివరించారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి వంటి మూడు ప్రధాన అభివృద్ధి కారిడార్ల ద్వారా రాష్ట్ర ప్రగతిని పరుగులు తీయిస్తున్నామని, అమరావతిని శాశ్వత రాజధానిగా పునరుద్ధరించడమే కాకుండా పోలవరం పనులను వేగవంతం చేశామని గుర్తుచేశారు. పారిశ్రామిక రంగంలో 8.74 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని, అలాగే ప్రతి నియోజకవర్గంలో ఏం ఎస్ ఎం ఇ పార్కుల ఏర్పాటు జరుగుతోందని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, క్వాంటం వ్యాలీ, ఎ ఐ డ్రోన్ స్కిల్ సెంటర్ల ఏర్పాటు భవిష్యత్తు అవసరాలకు నిదర్శనమని వెంకట్రావ్ కొనియాడారు. గతంలో వివాదాస్పదమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భరోసా కల్పించామని, శాంతిభద్రతల పరిరక్షణ ద్వారా పెట్టుబడిదారులలో నమ్మకాన్ని పెంచామని ఆయన చెప్పారు. మొత్తానికి ఈ ప్రభుత్వం సంక్షేమంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టిస్తూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఆయన తన ప్రసంగంలో స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలోని అనిశ్చితికి తెరదించుతూ, ప్రస్తుత ప్రభుత్వం స్థిరత్వం, అభివృద్ధి లక్ష్యంగా అడుగులు వేస్తోందని గత ప్రభుత్వ హయాంలో ఆడంబరపు ప్రకటనలు తప్ప, ఆచరణలో లోపాలు స్పష్టంగా కనిపించేవని విమర్శించారు. ముఖ్యంగా ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందక ఇబ్బంది పడటం, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి ఉపాధ్యాయులను బోధనేతర పనులకు పరిమితం చేయడం వంటి చర్యలు రాష్ట్ర ప్రగతిని కుంటుపరిచాయని మండిపడ్డారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన 18 మెడికల్ కాలేజీలు నిధుల కొరతతో మధ్యలోనే నిలిచిపోగా, అభివృద్ధి పనుల కంటే సలహాదారుల వ్యవస్థకే వందల కోట్లు ఖర్చు చేయడం విమర్శలకు దారితీసిందని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు విషయంలో జరిగిన జాప్యం వల్ల ప్రాజెక్టు వ్యయం రెట్టింపు అయ్యే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు ఆలస్యమైతే అయ్యే నష్టాన్ని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి గుర్తించకపోవడం రాష్ట్రానికి తీరని లోటుగా మారిందన్నారు. అయితే నేడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని ప్రభుత్వ నిర్ణయాల్లో స్పష్టత, అమలులో వేగం కనిపిస్తోందని చెప్పుకొచ్చారు. ప్రజల అవసరాలకు తగ్గట్లుగా అభివృద్ధి, ఉపాధి కల్పన, బాధ్యతాయుతమైన పాలనను అందిస్తూ ప్రజల్లో కోల్పోయిన నమ్మకాన్ని ఈ ప్రభుత్వం తిరిగి సంపాదిస్తోందన్నారు. ప్రస్తుత బడ్జెట్ సైతం ఇదే అభివృద్ధి దిశగా రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందని ఎమ్మెల్యే యార్లగడ్డ పేర్కొన్నారు.

## ఇంటింటి వ్యర్థాల సేకరణలో లోపం ఉండరాదు



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఇంటింటి వ్యర్థాల సేకరణలో అటువంటి లోపం ఉండరాదనీ, అవసరమైతే వాహనాల ట్రిప్పులు పెంచి వ్యర్థాలను పూర్తిస్థాయిలో సేకరించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం శాఖాధిపతులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లను, పారిశుధ్య కార్మికుల సమ్మె వలన వారు తీసుకుంటున్న చర్యలను అడిగారు. పర్మినెంట్ వర్కర్లతో పారిశుధ్య నిర్వహణ జరిపిస్తున్నామని వారు కూడా ఫీల్డ్ లోనే అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎక్కడ ఇబ్బంది కలగకుండా చూసుకుంటున్నామన్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉన్న సందర్భంగా నగరంలో ఎక్కడ పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉంటూ, ఉన్న పారిశుధ్య కార్మికులతో ఎక్కడ వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని, ఫీల్డ్ లోనే ఉంటూ ఎక్కడైనా అవసరం ఉంటే వెంటనే ఆ ప్రాంతానికి పారిశుధ్య కార్మికుల ద్వారా అక్కడున్న వ్యర్థాలను తొలగించేటట్టు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు పారిశుధ్య నిర్వహణపై ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని అన్నారు. గురువారం అర్ధరాత్రితో సమ్మె విరమిస్తారు కాబట్టి శుక్రవారం ఉదయం వ్యర్థాల సేకరణలో, పారిశుధ్య నిర్వహణలో విస్తృత చర్యలు తీసుకొని ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని అవసరమైతే వ్యర్థాల సేకరణ వాహనాలను ట్రిప్పులు పెంచి వ్యర్థాలను సేకరించాలని అన్నారు.

## గ్రామీణ మహిళలకు ఆర్థిక స్వావలంబన దిశగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ



**విజయవాడ మేజర్ న్యూస్ :** గ్రామీణ మహిళలు తమ జీవనోపాధి అవకాశాలను విస్తరించుకుని ఆర్థికంగా స్వాలంబన సాధించే దిశగా నడిపించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ సారథ్యంలో కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి ప్రధాన కార్యాలయంలో హ్యాండ్ మేడ్ పేపర్ ప్రొడక్ట్స్ తయారీపై అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణను ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎస్.హెచ్.జి మహిళలు అందిపుచ్చుకుంటున్నారు. ఫిబ్రవరి 9 వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమంలో నాలవ రోజు గురువారం ఎన్.ఐ.ఆర్.డిలో ఎస్.హెచ్.జి మహిళలు పొందిన శిక్షణ వివరాలను తెలియజేస్తూ ఎంపీ కేశినేని శివనాథ్, కేశినేని ఫౌండేషన్ కార్యాలయం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్.ఐ.ఆర్.డి లో హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీకి సంబంధించి గాంధీ హ్యాండ్ మేడ్ పేపర్ యూనిట్ అధికారి జె.రవీంద్రరావు నేతృత్వంలో పల్ప్ తయారీ, షీట్ నిర్మాణం, స్క్రీన్ ప్రింటింగ్, ఎన్వలప్ కవర్స్, పెన్స్ స్టాండ్ తయారీ పై అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం వీటిని ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చారు.. అలాగే స్క్రీన్ ప్రింటింగ్ యూనిట్ ను సందర్శించారు.

# 21 న కొచ్చి లో 70వ ఫిలింఫేర్ అవార్డ్స్ సౌత్ విత్ కేరళ టూరిజం

**విజయవాడ మేజర్ న్యూస్ :** 2024 సంవత్సరంలో విడుదలైన చిత్రాల కోసం మలయాళం, కన్నడ, తమిళం, తెలుగు సినిమాల్లో అత్యుత్తమ ప్రతిభను, సినిమా నైపుణ్యాన్ని గౌరవిస్తూ, కేరళ టూరిజంతో 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ కోసం నామినేషన్లను ప్రకటించింది. ఈ సందర్భంగా కేరళ ప్రభుత్వ టూరిజం విభాగ పబ్లిక్ వర్క్స్ ప్రతినిధి పి.ఎ.మొహమ్మద్ రియాస్, టైమ్స్ టెలివిజన్ నెట్‌వర్క్ డిజిటల్, టైమ్స్ స్ట్రాటజిక్ సొల్యూషన్స్ లిమిటెడ్ డైరెక్టర్ రోహిత్ గోపకుమార్, మాట్లాడుతూ ఈ సౌత్ ఫిలింఫేర్ అవార్డుల ప్రధానోత్సవం కొచ్చి ఫిబ్రవరి 21న అడ్లక్స్ ఇంటర్నేషనల్ కాన్వెంట్ సెంటర్‌లో జరుగుతాయని తెలిపారు. మలయాళం, తమిళ్, కన్నడ, తెలుగు సినిమాల నామినేషన్లు ప్రకటించబడ్డాయన్నారు. దక్షిణ భారత సినిమా అంతటా శ్రేష్ఠతను గుర్తించే ల్యాండ్‌మార్క్ 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ వేడుకను నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్రం చాలా కాలంగా చిత్రనిర్మాతలకు ఇష్టమైన కాన్వాస్‌గా ఉంది, ఉత్కంఠ భరితమైన ప్రకృతి దృశ్యాలు, గొప్ప సాంస్కృతిక వారసత్వం, కథా కథనాలకు లోతైన అనుబంధాన్ని అందిస్తోందన్నారు. ఫిల్మ్ టూరిజం, క్రియేటివ్ ఎక్స్ఛేంజ్ కోసం ఒక శక్తివంతమైన కేంద్రం అని, "మొట్టమొదటిసారిగా మా మార్క్యూ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్‌లో కేరళ రాష్ట్రంలో నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. కేరళ సౌత్ ఇండియా యొక్క సహజత్వం, కంటెంట్‌ను రూపొందించడానికి ఒక భారీ సహకారం అందించిందని, మలయాళ చలనచిత్ర పరిశ్రమలో ఈ సంఘటన జరగడం పట్ల ఉల్లాసంగా ఉన్న దక్షిణ భారత చలనచిత్రం ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ కథల యొక్క శక్తివంతమైన పునరుద్ధరణకు దారితీసింది ఐకమత్యం, వారసత్వం, సినిమా భవిష్యత్తు కోసం మేము దీన్ని సాధ్యం చేసినందుకు మా భాగస్వాములకు, కేరళ టూరిజం, కమర్ ఫిల్మ్ ఫ్యాక్టరీకి ధన్యవాదాలు తెలిపారు. కమర్ ఫిల్మ్ ఫ్యాక్టరీ వ్యవస్థాపకుడు కమర్ డి మాట్లాడుతూ, "కమర్ ఫిల్మ్ ఫ్యాక్టరీలో, సినిమా ఎల్లప్పుడూ మా ప్రయాణానికి గుండెకాయగా ఉంటుంది, 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ కోసం ఫిల్మ్‌ఫేర్‌తో భాగస్వామ్యం అనేది భాగస్వామ్య విలువల యొక్క సహజమైన అమరిక అన్నారు.

**సౌత్ సినిమాలకు ఫిలింఫేర్ అవార్డుల ప్రధానోత్సవం**




# డిఓపి, ఎన్ఎస్ఇకు కుదిరిన అవగాహన ఒప్పందం

**విజయవాడ, మేజర్ న్యూస్ :** అంత్యోదయ దృష్టిని సాకారం చేసే దిశగాక్యూలోని చివరి వ్యక్తిని కూడా అభివృద్ధి మార్గంలోకి తీసుకురావడం, 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణ లక్ష్యంతో, భారత ప్రభుత్వం కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖకు చెందిన తపాలా శాఖ (డిఓపి), భారతదేశపు అతిపెద్ద రియల్-టైమ్ ఆర్థిక ఎకోసిస్టమ్ అయిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఇ) కలిసి ఎన్ఎస్ఇ ఎంఫ్ ఇన్వెస్ట్ ప్లాట్‌ఫారమ్‌లో భాగస్వామ్యానికి అవగాహన ఒప్పందం (ఎంఓయు)పై సంతకం చేశాయి. ఈ భాగస్వామ్యం ద్వారా గ్రామీణ, చిన్న పట్టణాల ప్రజల చిన్న పొదుపులను మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులుగా మార్చి, వాటిని దీర్ఘకాలిక సంపదగా రూపాంతరం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి, ఆశిష్‌కుమార్ చౌహాన్, మేనేజింగ్ డైరెక్టర్ & సిఇఒ, ఎన్ఎస్ఇ హాజరయ్యారు. ఆయన సమక్షంలో, ఈ అవగాహన ఒప్పందంపై మనీషా బన్సాల్ బాదల్, జనరల్ మేనేజర్ (సిటిజన్ సెంట్రిక్ సర్వీసెస్ & రూరల్ బిజినెస్), తపాలా విభాగం, శ్రీరామ్ కృష్ణన్, చీఫ్ బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎన్ఎస్ఇ సంతకం చేశారు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ఇండియా పోస్ట్ యొక్క విస్తృతమైన 1.64 లక్షల పోస్టాఫీసుల నెట్‌వర్క్ (దాంట్లో 80%కు పైగా గ్రామీణ ప్రాంతాల్లో), ఎన్ఎస్ఇ యొక్క ఆధునిక, సున్నా-ఖర్చు ఎన్ఎస్ఇ ఎంఎఫ్ ఇన్వెస్ట్ ప్లాట్‌ఫామ్‌ను కలిపి, సమాజాల్లో బలంగా నెలకొన్న విశ్వాసాన్ని ఉపయోగించుకోనుంది. పరిశ్రమ బలంగా పెరుగుతున్నప్పటికీ మ్యూచువల్ ఫండ్ వినియోగం ఇంకా ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోనే పరిమితమై, కేవలం సుమారు 10% భారతీయ గృహాలకు మాత్రమే చేరుకుంది. ప్రస్తుతం అసెట్స్ అండర్ మేనేజ్మెంట్ రూ.81 లక్షల కోట్లను దాటగా, ఎస్ఐపి ప్రవాహాలు కూడా బలంగా కొనసాగుతున్నాయి. కోట్లాది మంది తల్లులు, రైతులు, రోజువారీ కూలీలు, యువ స్వాప్నికులు మ్యూచువల్ ఫండ్ల ద్వారా మెరుగైన దీర్ఘకాలిక వృద్ధిని సాధించేందుకు ఇండియా పోస్ట్ యొక్క విస్తృత పరిధి, విశ్వసనీయత కీలకంగా నిలుస్తుంది. ఈ ప్రయత్నం సమగ్ర వృద్ధిని ప్రోత్సహించడంతో పాటు దేశీయ పెట్టుబడులను పెంచి, తక్కువ లాభాల ఎంపికలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది.



**భాగస్వామ్యానికి ఎన్ఎస్ఇ కీలక సహకారాలు**

**పూర్తి ఎండ్-టు-ఎండ్ పరిష్కారం:** ఎన్ఎస్ఇ ఎంఫ్ ఇన్వెస్ట్ పెట్టుబడిదారుల మొత్తం జీవిత చక్రాన్ని కవర్ చేసే టర్న్‌కీ, పూర్తిగా సమగ్ర ప్లాట్‌ఫామ్‌ను అందిస్తుంది. కేవైసీ నుండి ప్రారంభించి, పోస్టాఫీసుల్లో మొబైల్/ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ లేదా ఎన్ఎస్ఇ ఎంఫ్ ఇన్వెస్ట్‌తో నడిచే ఇండియా పోస్ట్ సిస్టమ్/యాప్ ద్వారా ఆన్‌బోర్డింగ్, లావాదేవీలు, బ్యాక్-ఆఫీస్ సమీకరణ వరకు అన్ని సేవలను అందిస్తుంది. ది 2,500 లీడర్ ఇనిషియేటివ్: ఎన్ఎస్ఇ, ఇండియా పోస్ట్‌కు చెందిన 2,500 మంది సిబ్బందికి ఎన్ఐఎస్ఎం సర్టిఫికేషన్, ఇయుఐఎన్ రిజిస్ట్రేషన్‌కు పూర్తిగా నిధులు సమకూర్చేందుకు కట్టుబడి ఉంది. దీంతో గ్రామీణ భారతదేశంలో ధృవీకరించబడినసంపద నిపుణుల ముందంజ బలపడుతుంది.

**పాన్-ఇండియా సపోర్ట్ కమాండ్:** ఎన్ఎస్ఇ మొత్తం 23 పోస్టల్ సర్కిళ్లలో, డాక్ భవన్‌లో 24/7 క్షేత్ర స్థాయి సహాయాన్ని అందించేందుకు అంకితమైన సాంకేతిక, కార్యాచరణ వనరులను ఏర్పాటు చేస్తుంది.

**సింప్లిసిటీ నుంచి స్కేల్ వరకు:** ప్రారంభ దశలో సరళమైన, విభిన్నీకరించిన, సులభంగా అర్థమయ్యే విధానంతో అమలు ప్రారంభమవుతుంది. ఎన్ఐఎస్ఎం సర్టిఫికేషన్, నియంత్రణ అనుసరణ తర్వాత డిఐవై, సహాయక కస్టమర్ల కోసం సహాయంతో కూడిన ఎంపికలు అందుబాటులోకి వస్తాయి. అనంతరం, రెండో దశలో ఇది పూర్తి స్థాయి సంపద నిర్వహణ ఎకోసిస్టమ్‌గా అభివృద్ధి చెందుతుంది.

# మ్యాగీ 50 సంవ.లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్మారక తపాలా స్టాంపును విడుదల

**విజయవాడ, మేజర్ న్యూస్ :** మ్యాగీ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఒక ప్రత్యేక స్మారక తపాలా స్టాంపును విడుదల చేయడం పట్ల నెస్లే ఇండియా ఎంతో సంతోషిస్తోంది. ఈ స్టాంపును నెస్లే ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ తివారీ, భారత ప్రభుత్వ ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ స్టాంపు మ్యాగీ యొక్క పరిణామానికి, ఎప్పటికప్పుడు కొత్త పోకడలను అందిపుచ్చుకుంటూ, ఎంతో ఆదరణ పొందిన ఒక ఉత్పత్తి వర్గానికి పర్యాయపదంగా మారిన దానికి నివాళి. ఇన్ని తరాలుగా, ప్రతి ఒక్క పంచుకునే క్షణం ద్వారా ప్రజలను ఏకం చేస్తూ వస్తున్న మ్యాగీకి ఇది ఒక గౌరవం. గత ఐదు దశాబ్దాలుగా, మ్యాగీ భారతీయ ఇళ్లలోకి అనేక రుచికరమైన రూపాల్లో ప్రవేశించింది - నూడుల్స్ మసాలాల నుండి సాస్‌లు, సూప్‌లు రెడీ-టు-కుక్ ఇష్టమైనవి. త్వరిత సోలో ఫిక్స్‌ల నుండి కుటుంబాన్ని ఒకచోట చేర్చే భోజనాల వరకు హాస్టల్ కిచెన్‌ల నుండి పెద్ద సమావేశాల వరకు, మ్యాగీ దేశవ్యాప్తంగా లెక్కలేనన్ని ఆహార క్షణాలలో భాగంగా ఉంది. "50 సంవత్సరాల కలిసికట్టుగా" స్టాంప్ ఈ భాగస్వామ్య అనుభవాలకు నివాళి, మ్యాగీభారతదేశం అంతటా టేబుల్‌లకు తీసుకువస్తున్న వెచ్చదనం, సౌకర్యం సంబంధాలను సంగ్రహిస్తుంది. భారత ప్రభుత్వ ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ, "భారతదేశంలో శుద్ధి చేసిన ఆహార రంగం దశాబ్దాలుగా గృహాల విశ్వాసాన్ని చూరగొనడంలో చాలా దూరం ప్రయాణించింది. మార్గదర్శక బ్రాండ్‌లు కొత్త విభాగాలను సృష్టించి, మన ఆహార పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేశాయి. ఈ అద్భుతమైన ప్రయాణంలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు నేను మ్యాగీకి అభినందనలు తెలియజేస్తున్నాను." ఈ స్టాంపును విడుదల చేస్తున్నట్లు



ప్రకటిస్తూ, నెస్లే ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్మనీష్ తివారీ ఇలా అన్నారు, "భారతదేశంలో మ్యాగీకి ఇది నిజంగా ఒక ప్రత్యేకమైన మైలురాయి. మన దేశంలాంటి ఉత్సాహభరితమైన విభిన్నమైన దేశంలో ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకోవడం, లక్షలాది మంది ఈ బ్రాండ్‌పై చూపిన నమ్మకం, ఆప్యాయత నిత్య ప్రేమకు నిదర్శనం. ఇది పంచుకున్న మధుర క్షణాలు, మారుతున్న అభిరుచులు ఏటా, తరతరాలుగా మరింత బలపడిన బంధంతో రూపుదిద్దుకున్న ఒక ప్రయాణానికి వేడుక." ఈ అనుబంధాన్ని బలోపేతం చేయడానికి, దేశవ్యాప్తంగా ప్రజల జీవితాల్లో వెచ్చదనం, సౌకర్యం, ఐక్యతను తీసుకువచ్చే రోజువారీ క్షణాలకు తోడ్పడటానికి నెస్లే ఇండియా కట్టుబడి ఉంది.

## ఓల్డ్ బ్రిడ్జ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌ను విడుదల చేసిన ఓల్డ్ బ్రిడ్జ్ మ్యూచువల్ ఫండ్



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఓల్డ్ బ్రిడ్జ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌ను విడుదల చేస్తున్నట్లు ఓల్డ్ బ్రిడ్జ్ మ్యూచువల్ ఫండ్ వెల్లడించింది. ఇది లార్జ్-క్యాప్, మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ స్టాక్‌లలో పెట్టుబడి పెట్టే ఓపెన్-ఎండ్ డైనమిక్ ఈక్విటీ పథకం. ఇది పెట్టుబడిదా రులకు ఒకే వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియో ద్వారా మార్కెట్‌ను అన్వేషించటాన్ని సులభ తరం చేస్తుంది. ఓల్డ్ బ్రిడ్జ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ యొక్క కొత్త ఫండ్ ఆఫర్ ఈ నెల 13న ప్రారంభమై, ఈ నెల 23న ముగుస్తుంది. ఈ పథకం యూనిట్‌కు రూ.10 ప్రారంభ ధరతో అందించబడుతుంది, ఏకమొత్తం దరఖాస్తులకు కనీసం రూ.5,000, ఎస్ఐపి లకు రూ. 1,000 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఈ ఫండ్ బాటమ్-అప్, బిజినెస్- బై-బిజినెస్ పెట్టుబడి విధానాన్ని అనుసరిస్తుంది. ఓల్డ్ బ్రిడ్జ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌ను ఓల్డ్ బ్రిడ్జ్ అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ కెన్నెత్ ఆండ్రేడ్ నిర్వహిస్తారు. ఈ ఫండ్ బీఎస్ఈ 500 ట్రైకి అనుగుణంగా బెంచ్‌మార్క్ చేయబడింది. గ్రోత్, ఐడీసీడబ్ల్యూ అవకాశాలతో డైరెక్ట్, రెగ్యులర్ ప్లాన్‌ల క్రింద అందుబాటులో ఉంటుంది.

## రాధాకృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించిన కైలే



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని భద్రిరాజుపాలెం గ్రామంలో గురువారం జరిగిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చాగంటి రాధాకృష్ణారెడ్డి పెద్ద కర్మ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాఘవులు పార్థివ దేహానికి నివాళులర్పించిన కైలే



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని చాగంటి పాడు గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కలపాల రాఘవులు అనారోగ్యంతో స్వర్గస్తులు కాగా పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ గురువారం ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసిన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ తో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.



**పలు కుటుంబాలకు కైలే పరామర్శ**

చాగంటిపాడు గ్రామంలో పలు కుటుంబాలను మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు.

## వక్ఫ్ ఆస్తులకు మున్సిపల్ తీర్మానం ఎలా చేశారు

### అహేలే సున్నతుల్ జమాత్ కన్వీనర్ అల్తాఫ్ బాబా



**కొండపల్లి మేజర్ న్యూస్ :** గజరాజు చెరువు కట్ట సర్వే నంబర్ 433 సమీపంలో వక్ఫ్ గజిట్ 1962, సీరియల్ నెంబర్ 762 ప్రకారం మసీదు గడ్డ 11 ఎకరాల 25 సెంట్లు ముస్లిం బరియల్ గ్రౌండ్‌కు చెందినది. గతంలో స్మశానాను ఆక్రమించి వీటిపిఎస్ వారు.మిగిలిన భూమిని మున్సిపాలిటీ ఆక్రమించి రెవిన్యూ ఎన్ఓసీ తీసుకొని వక్ఫ్ భూమిని ఇష్టానుసారంగా ఆయుర్వేదిక్ హాస్పిటల్ నిర్మాణానికి ఇవ్వడం వ్యతిరేకిస్తున్నామని ఆహలే సున్నతుల్ జమాత్ కన్వీనర్ అల్తాఫ్ బాబా తెలిపారు.అధికారులకు, ప్రభుత్వాలు మైనార్టీ ఆస్తులపై ఏ విధమైన కుట్ర జరుగుతుందో... అని అనుమానం వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఉన్నత అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలు నిలుపుదల చేయాలని లేని పక్షంలో ఉన్నత న్యాయస్థానం ఆశ్రయించి న్యాయం కోసం పోరాడుతామని హెచ్చరించారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు మసీదు గడ్డ 15 ఎకరాల భూమిపై సంబంధిత ఫిర్యాదుల వందల పేజీలలో సుమారు 80 పేజీల నివేదికను ఫిర్యాదు రూపంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు ఫిర్యాదు చేశారు. ఉన్నత అధికారులకు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు.. వెంటనే తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# నూతన కార్మిక, పీఎఫ్ఆర్‌డీఏ చట్టాలను రద్దు చేయాలి

**సార్వత్రిక సమ్మెకు పూర్తి మద్దతు**

**వేతన సవరణ కమిటీ నియామకాన్ని వెంటనే చేపట్టాలి**

**సీపీఎస్ రద్దుకు చర్యలు తీసుకోవాలి**

**ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏ. విద్యాసాగర్**





**నెల్లూరు, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్ :** ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్ల హక్కులను దెబ్బతీసేలా అమలులోకి తీసుకొచ్చిన నూతన కార్మిక చట్టాలు, పీఎఫ్ఆర్‌డీఏ చట్టాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వేతన సవరణ కమిటీని నియమించి సీపీఎస్ రద్దు దిశగా స్పష్టమైన చర్యలు చేపట్టాలని ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు విద్యాసాగర్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు గురువారం ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ ఎదుట లంచ్ అవర్ డిమానిస్ట్రేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసాగర్ ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. జాతీయ స్థాయిలో ఉద్యోగులంతా జరుగుతున్న పరిణామాలు అన్నిటినీ గమనించి ఒక తాటి మీదకు రావాలని, గత రెండు దశాబ్దాలుగా ఉద్యోగుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పరిణామాల దేశవ్యాప్తంగా ఉద్యోగులందరూ ప్రతిఘటించాలని కోరారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యోగుల సంక్షేమానికి విరుద్ధంగా ఉన్న నూతన కార్మిక చట్టాలు కార్మికుల హక్కులను కుదించే విధంగా ఉన్నాయని, ఉద్యోగ భద్రత, వేతన రక్షణ, సామాజిక భద్రత అంశాల్లో ఈ చట్టాలు అనేక అనిశ్చితులు సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. పీఎఫ్ఆర్‌డీఏ చట్టం ద్వారా పెన్షన్ వ్యవస్థను పూర్తిగా మార్కెట్ ఆధారంగా మార్చడం వల్ల ఉద్యోగుల భవిష్యత్తు అస్థిరతకు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎస్ విధానం కారణంగా ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం తగిన భద్రత పొందలేకపోతున్నారని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల భవిష్యత్తు భద్రత కోసం ఇది అత్యంత అవసరమని ఆయన స్పష్టం చేశారు. అలాగే, పెరుగుతున్న ధరల దృష్ట్యా వేతన సవరణ కమిటీని ఆలస్యం చేయకుండా వెంటనే నియమించి ఉద్యోగుల వేతనాలను సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాలు ఇచ్చిన సార్వత్రిక సమ్మెకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసనలు తెలియజేస్తూ సంఘీభావం ప్రకటిస్తున్నారని తెలిపారు. ఇది ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన ప్రజాస్వామ్యపరమైన పోరాటమని పేర్కొన్నారు. పబ్లిక్ సెక్టార్ గురుకుల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాల పెంచాలని కోరారు. మేము 57 ప్రకారం 11,000 మంది ఉద్యోగులను ఓ పి ఎస్ లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, పదోన్నతుల్లో జరుగుతున్న నష్టాన్ని భర్తీచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులకు నష్టం కలిగించే ఎలాంటి చట్టాలునైనా, నిబంధనలునైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తే వాటిని ప్రతిఘటించి ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూసేందుకు ఏపీ ఎన్‌జీజీవో సంఘం పూర్తి బాసటగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్జీజీఓస్ అసోసియేషన్, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు, గాదిరాజు రామకృష్ణ, జిల్లా కార్యదర్శి, సహధ్యక్షుల ఆంజనేయ వర్మ, రాజేంద్ర ప్రసాద్, సతీష్,,బ్రహ్మేశ్వర్ రావు, రాజేంద్ర, నెల్లూరు నగర అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, కృష్ణ కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అజయ్ కుమార్,కార్యదర్శులు శ్రీనివాసులు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, జేఏసీ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పై వస్తున్న ఆరోపణలను ఖండించిన అంబాపురం సర్పంచ్ సీతయ్య....



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** నిస్వార్థ ప్రజాసేవకుడు, నీతికి నిజాయితీకి మారుపేరుగా పనిచేస్తున్న గన్నవరం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు పై వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని అంబాపురం గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య హెచ్చరించారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురం పంచాయతీ కార్యాలయంలో ఆయన గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గన్నవరంలోని రైతు బజార్ విషయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పై వైసీపీ నాయకులు తమ అనుకూల మీడియా వేదికగా చేస్తున్న దుష్ప్రచారాన్ని సర్పంచ్ సీతయ్య తీవ్రంగా ఖండించారు.యార్లగడ్డ వెంకటరావు పై తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలు నమ్మేస్తారన్న భ్రమలో వైసీపీ నాయకులు ఉన్నారన్నారు.అనునిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతూ మంచి ప్రజానేతగా యార్లగడ్డ వెంకట్రావు పేరు తెచ్చుకుంటున్నారన్నారు.గన్నవరం నియోజకవర్గంలో ఆయనకు లభిస్తున్న ప్రజాదరణ,అభిమానం చూసి తట్టుకోలేక వైసిపి నాయకులు బురద జల్లే ప్రయత్నంలో భాగమే ఈ తప్పుడు ప్రచారం అన్నారు. ఆయనకున్న అన్ని వ్యాపారాలను పక్కనపెట్టి ప్రజాసేవ చేసేందుకు వచ్చిన నాయకుడు యార్లగడ్డ వెంకట్రావు అని, రోజుకు 24 గంటలలో 20 గంటల పాటు ప్రజాసేవకే ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఎవరో ఒక వ్యక్తి ఎమ్మెల్యే పేరు చెప్పి ఆయన డబ్బులు వసూలు చేయమన్నారని,డబ్బులు తీసుకుంటున్నారంటూ వచ్చిన ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదన్నారు. నిజంగా ఎమ్మెల్యే తప్పుచేసి ఉంటే తగిన ఆధారాలు వైయస్సార్సీపి నాయకులు చూపాలని సవాల్ విసిరారు. ఆధారాలు లేకుండా రాజకీయ లబ్ధికోసం బురదజల్లే ప్రయత్నాలు చేస్తే, చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఇప్పటికే వైయస్సార్ సిపి నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని, లేనిపక్షంలో రానున్న కాలంలో ప్రజలు మరోసారి బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వైసిపి నాయకులు ఎంత అసత్య ప్రచారం చేసినా ప్రజలు నమ్మరు, నిబద్ధతగల నాయకుడిగా, నిజాయితీపరుడుగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నియోజకవర్గానికి చేస్తున్న సేవలు ప్రజలందరికీ తెలుసని చెప్పారు.ఈ విలేకరుల కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మండల రాజేష్, మాజీ ఎంపీపీ తోడేటి రూబెన్, టిడిపి సీనియర్ నాయకులు చిలుఊరి ప్రభాకర్,సిద్దెల రాజా, వార్డ్ మెంబర్ వసంత్, ఎన్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల హక్కుల పరిరక్షణే మా లక్ష్యం

**మా ప్రతి అడుగు ఉద్యోగుల ప్రయోజనాలు వైపే**

**వేతన సవరణ కమిటీ నియామకాన్ని వెంటనే చేపట్టాలి**

**నూతన కార్మిక, పీఎఫ్ఆర్‌డీఏ చట్టాలను రద్దు చేయాలి**

**ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ**






**విజయవాడ, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్ :** ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమమే మా ప్రధాన లక్ష్యమని ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి అడుగూ ఉద్యోగుల ప్రయోజనాల దిశగా వేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు గురువారం ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో విజయవాడ బందరు రోడ్డులోని పంచాయతీరాజ్ కార్యాలయ ఆవరణలో లంచ్ అవర్ డిమానిస్ట్రేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీవీ రమణ ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాలు ఇచ్చిన సార్వత్రిక సమ్మెకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసనలు తెలియజేస్తూ సంఘీభావం ప్రకటిస్తున్నారని తెలిపారు. ఇది ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన ప్రజాస్వామ్య పోరాటమని పేర్కొన్నారు. నూతన కార్మిక చట్టాలు, పీఎఫ్ఆర్‌డీఏ చట్టాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వేతన సవరణ కమిటీని నియమించి, సీపీఎస్ రద్దు దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పెరుగుతున్న ధరల దృష్ట్యా వేతన సవరణ కమిటీని ఆలస్యం చేయకుండా వెంటనే నియమించి ఉద్యోగుల వేతనాలను సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, పదోన్నతుల్లో జరుగుతున్న నష్టాన్ని భర్తీచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులకు నష్టం కలిగించే ఎలాంటి చట్టాలునైనా, నిబంధనలునైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తే వాటిని ప్రతిఘటించి ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూసేందుకు ఏపీ ఎన్‌జీజీవో సంఘం పూర్తి బాసటగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీజీవో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన విద్యాసాగర్ ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వంనుంచి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలతో పాటు డిమాండ్ల సాధనకు అడుగులు వేస్తున్నారన్నారు. డీఏ అరియర్స్, సీపీఎస్ ఉద్యోగుల బకాయిల చెల్లింపులో కొంత పురోగతి ఉందన్నారు. ప్రధానంగా 2023 జూలై నెలలో నియమించాల్సిన వేతన సవరణ కమిటీ (పి.ఆర్.సి.) చైర్మన్ నియామకంలో జాప్యం జరగకుండా బుధవారం నుంచి జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో కమిటీ నియామకంపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలన్నారు. ప్రభుత్వం వైపు నుంచి ఈ అంశంలో స్పష్టత లేని పక్షంలో ఏపీ జెఏసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ముందుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులు వీవీ ప్రసాద్, బి.సతీష్ కుమార్, పి.రామకృష్ణ, బీవీ రమణ, వి.నాగార్జున, ఎం.రాజుబాబు, నగర శాఖ అధ్యక్ష కార్యదర్శులు సీవీఆర్ ప్రసాద్, ఎస్కే నజీరుద్దీన్, టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎల్ సోమయాజులు, ఆర్ అండ్ బీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మునికేశవులు, పంచాయతీరాజ్ డిప్లొమా అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వెంకట్‌రెడ్డి, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సాంబశివరావు, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# క్రీడలలో ఉత్సాహం ఉంటే చదువులోనూ రాణింపు సాధ్యం



## ఉప విద్యా శాఖాధికారి కొండా రవి కుమార్

**గన్నవరం, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్ :** క్రీడలలో ఉత్సాహంగా పాల్గొనే విద్యార్థులు చదువులో కూడా చక్కగా రాణిస్తారని గుడివాడ ఉప విద్యా శాఖాధికారి కొండా రవి కుమార్ పేర్కొన్నారు. కృష్ణా జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో గురువారం గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జూడో శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడలలో కూడా ప్రోత్సహించాలని సూచించారు. క్రీడల ద్వారా దేహదారుఢ్యం పెరిగి, ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటారని తెలిపారు. క్రీడలలో ప్రతిభ కనబరిస్తే ప్రత్యేక క్రీడా కోటా ద్వారా ఉన్నత విద్యలో సీట్లు, ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశాలు లభిస్తాయని చెప్పారు. దీని ద్వారా తక్కువ సమయంలోనే జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించే అవకాశముంటుందని వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి మాట్లాడుతూ, జూడోలో ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు తమ పాఠశాలను శిక్షణా కేంద్రంగా ఎంపిక చేయడం ఆనందకరమని అన్నారు. శిక్షణకు అవసరమైన మ్యాట్లు, దుస్తులు ఉచితంగా అందిస్తున్న జూడో సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ భారత జూడో సంఘం కార్యదర్శి, ప్రస్తుత కృష్ణా జిల్లా జూడో సంఘం కార్యదర్శి నామిశెట్టి వెంకట్ మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. గన్నవరం ప్రాంతం నుండి జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశంతో ఈ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. నైపుణ్యం కలిగిన యువ శిక్షకుడిని నియమించినట్లు వెల్లడించారు. బొండాడ గ్రూపుల అధినేత బొండాడ రాఘవేంద్రరావు సహకారంతో జూడో క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గన్నవరం వాకర్స్ సంఘం అధ్యక్షులు కె.వి.ఆర్. కిషోర్ మాట్లాడుతూ, ఆర్థిక పరిస్థితుల వల్ల క్రీడలలో ముందుకు రాలేకపోతున్న ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పాఠశాల వ్యాయామ విద్య సహాయకులు, జిల్లా జూడో సంఘం సంయుక్త కార్యదర్శి ధనియాల నాగరాజు మాట్లాడుతూ, అందరి సహకారంతో ఉత్తమ క్రీడాకారులను దేశానికి అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విద్య సహాయకులు షేక్ మీరా సాహెబ్, కె. టాన్యాగిరి, జిల్లా జూడో సంఘం సంయుక్త కార్యదర్శి ఏ. వీరబాబు, సభ్యులు చైతన్య, శిక్షకులు ఎం. నాగదుర్గ, ఎస్. చందు తదితరులు పాల్గొన్నారు. జాతీయ జూడో క్రీడాకారులు ప్రవల్లిక, కీర్తన, సతీష్, జశ్వంత్ ప్రదర్శించిన క్రీడా విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముందుగా ఆంజనేయ స్వామి చిత్రపటానికి నామిశెట్టి వెంకట్, కె.వి.ఆర్. కిషోర్ పూలమాలలు వేసి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపిన రాష్ట్ర ఐడిసి డైరెక్టర్



**విజయవాడ, మేజర్ న్యూస్ :** విజయవాడలోని కళ్యాణ మండపంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షురాలిగా ఇటీవల నియమితులైన గద్దె అనురాధ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన చెన్నుబోయిన చిట్టిబాబు, కార్యవర్గ ప్రమాణ స్వీకారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని పాల్గొని మైలవరం నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కమిటీలో ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షురాలుగా, కార్యనిర్వహక కార్యదర్శిగా, కార్యదర్శిగా నియమితులై నిన్న ప్రమాణ స్వీకారం చేసిన చెన్నుబోయిన చిట్టిబాబుని, ధరణికోట విజయలక్ష్మి ని, అఫ్సర్ ని, పజ్జూరు రవి కుమార్ ( వెంకయ్య) ని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి అంకెం సురేష్, ఎన్టీఆర్ జిల్లా ఐటిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి నక్కనబోయిన దుర్గా జగదీష్, జి.కొండూరు యూనిట్ కన్వీనర్ బెజవాడ గణపతి, పినపాక గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి శ్రీనివాసరావు, కలేకూరి రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.




## విద్యామంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై విద్యార్థి లోకం హర్షం వ్యక్తం చేస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గురువారం సాయంత్రం స్థానిక రాజీవ్ గాంధీ సెంటర్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో లోకేష్ చిత్రపటానికి విద్యార్థులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు విద్యా రంగానికి పెద్దపీట వేస్తూ, నిధులను విడుదల చేసిన లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆగిపోయే పరిస్థితిలో ఉన్న వేలాది మంది విద్యార్థులకు ఈ 1,200 కోట్ల విడుదల సంజీవనిలా మారిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులతోపాటు దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు,కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రావి రత్నగిరి,కార్యనిర్వాహక కార్యదర్శి కొల్లూరి ఇమ్మానియేలు,మండలి రామమోహనరావు,దానినేని శ్రీనివాసరావు పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# మహా శివరాత్రి తిరుణాలకి ముస్తాబైన వెల్వడం బాల కోటేశ్వర స్వామి దేవాలయం

**మైలవరం, మేజర్ న్యూస్ :** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని వెల్వడం గ్రామంలో ఉన్న బాల కోటేశ్వర స్వామి దేవాలయం నూతనంగా ముస్తాబయింది. ఈ నెల 15 ఆదివారం నుండి మూడు రోజుల పాటు జరిగే తిరుణాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయానికి ఎంతో ఘనమైన వైభవం ఉంది. ఆనాటి నుండి నేటి వరకు కృష్ణారెడ్డి వంశీకులు ఇక్కడ తిరునాళ్లు నిర్వహిస్తుంటారు. తిరువూరు, గంపలగూడెం, రెడ్డిగూడెం, విస్సన్నపేట, తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల నుంచి భక్తులు వస్తూ ఉంటారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్, ఎన్. సి. సి క్యాడెట్స్, వాలంటీర్లు భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అదుగడుగునా అధికారులు కూడా వారి సేవలు అందజేస్తారని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ సెక్రెటరీ ట్రెజరర్, బాల కోటేశ్వర స్వామి యువజన సంఘం నాయకుడు గూడూరు నాగి రెడ్డి తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం లకిరెడ్డి జయప్రకాశ్ రెడ్డి 15 న అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 2002లో లకిరెడ్డి బాలిరెడ్డి సోదరులు జయప్రకాశ్ రెడ్డి అన్నపూర్ణమ్మ దంపతుల సౌజన్యంతో 40 లక్షలతో ఆలయాన్ని సువిశాలంగా సుందరంగా తీర్చిదిద్దారు. డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి కోటి రూపాయల వితరణతో ఎప్పటినుండో మట్టి రోడ్ నీ తారు రోడ్డు వేశారు. మొదటి రోజు ఉత్సవ విగ్రహాలను గ్రామంనుండి ఊరేగింపుగా బాలకోటేశ్వర స్వామి గుడికి చేర్చడంతో ప్రారంభమవుతాయి. ఉదయం 04



గంటలకే మూల విరాట్ కు అభిషేకాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. పెద్ద కోనేటి లో స్నానాలు చేసి పితృ తర్పణాలు వదులుతారు. 15వ తేదీ రాత్రి ఒంగోలు జాతి ఎడ్లబండితో ప్రబల ఊరేగింపు చూసి తీరాల్సిందేగాని చెప్పనలవికాదు. 17న ముందుగా గ్రామ ప్రభలను, చివరగా ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించి అయ్యవార్ల మండపంలోకి చేరుస్తారు. గ్రామోత్సవంలో అయ్యవార్ల ఆధ్వర్యంలో నార్లములు అని చిన్న చిన్న శూలములతో శరీరంలో పొడుచుకొని శివుణ్ణి ఆరాధించడం విభూధిపండు తో ఎటువంటి గాయాలుకాకుండా చేయడం ఈ గ్రామ తిరునాళ్ల ప్రత్యేకత.

## పెద్దకళ్ళేపల్లి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**మోపిదేవి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పెద్దకళ్ళేపల్లి గ్రామంలోని ప్రాచీన పుణ్యక్షేత్రం శ్రీ దుర్గా నాగేశ్వరస్వామి వారి దేవస్థానంలో రానున్న మహాశివరాత్రి పురస్కరించుకొని బ్రహ్మోత్స వాలు వైభవంగా చేపట్టారు. గురువారం దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాదరావు శ్రీ స్వామి వారికి నూతన పట్టు వస్త్రములు సమర్పించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు బుద్ధు ప్రసాద్ నేతృత్వంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## కేసరపల్లికి కస్టమ్స్ కార్యాలయం




**గన్నవరం, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్ :** గన్నవరం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కృషితో కేసరపల్లిలో కస్టమ్స్ కార్యాలయాల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనరేట్, సెంట్రల్ ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు వీలుగా ప్రభుత్వం 3.84 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. కేసరపల్లిలోని సర్వే నంబర్ 29/8లో ఈ భూమిని కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం బుధవారం జరిగిన సమావేశంలో ఆమోదముద్ర వేసింది. ఇక్కడ కేవలం కార్యాలయ భవన సముదాయమే కాకుండా, అధికారులు, సిబ్బంది కోసం నివాస గృహాలను కూడా నిర్మించనున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చేలా చేయడంతో, త్వరలోనే ఈ కార్యాలయాలన్నీ కేసరపల్లిలో కొలువుదీరనున్నాయి.

## పేదల గుండెల్లో చిరస్థాయిగా సహాయ ఫౌండేషన్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** విజయవాడకు చెందిన ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ స్పందన సేవా సమితి"వారు సహాయ ఫౌండేషన్ సేవా క్యాంటీన్" కు80,000 ఖరీదు చేసే 55 రైస్ బ్యాగ్స్‌లు, 100 స్టీల్ ప్లేట్స్‌లను గురువారం అందించారు.సహాయ ఫౌండేషన్ లీగల్ సెల్ చైర్మన్ లంకిశెట్టి బాలాజీ వారికి ఘనంగా సన్మానించారు,వారు చేస్తున్న సేవలకు అభినందనలు తెలిపారు.గత రెండున్నర సంవత్సరాలుగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పల్లపోతు వారి సత్రంలో గర్భిణీ స్త్రీలకు,వికలాంగులకు అంగవైకల్యం వారికి ఫ్రీగా భోజనం అందిస్తూ వారి తోడుగా ఉండే వారికి 15 రూపాయలకే భోజనం అందిస్తున్న సహాయ ఫౌండేషన్ సేవలు స్పందించి విజయవాడ స్పందన సేవా సమితి మచిలీపట్నం వచ్చి సేవలో భాగస్వామ్యం కావడం అభినందనీయమని బాలాజీ అన్నారు.సహాయ ఫౌండేషన్ అధ్యక్షులు మొహమ్మద్ ఉస్మాన్ భాషా మాట్లాడుతూ పేద ప్రజలను స్పందన సేవా సమితి అందిస్తున్న సేవలు మరువలేనివి అని అన్నారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ, స్పందన సేవా సమితి అధ్యక్షులు ఇమ్మానేని కృష్ణ ప్రసాద్,ప్రధాన కార్యదర్శి యం.సాంబశివరావు,వి ప్రభేదర్,ఎం.వీ మోహన్ రావు,బి.వసంత కుమార్,మాదిరెడ్డి శ్యామ్, పి.భారతి, షఫీ,నాగమల్లేశ్వరి,హేమంత్ పాల్గొన్నారు సహాయ సభ్యులు, రామకృష్ణ, బదుగు ఉమా,సుధాబత్తుల లక్ష్మి,ఖాజా, రాము పాల్గొన్నారు.

## విద్యార్థులకు కళ్ళ జోళ్ళు పంపిణీ



**మొవ్వ మేజర్ న్యూస్:** అంధత్వనివారణలో భాగంగా మండల కేంద్రమైన మొవ్వ పీఎం శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థినీ విద్యార్థుల 30మందికి గురువారం కళ్ళజోళ్ళులు పంపిణీ చేశారు. మొవ్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సిహెచ్. రాజేశ్వరి ఆధ్వర్యంలో పారామెడికల్ ఆప్తమాలిక్ అసిస్టెంట్ సిహెచ్. మాధురి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్. ఉమాశ్రీ, హెల్త్ సూపర్వైజర్ బి. విజయ కుమార్, ఏఎన్ఎం ఎం.మాధవి, హెల్త్ అసిస్టెంట్ మట్టా.శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## పెద్ద ఎత్తున సమ్మెలో కార్మికులు

**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో గురువారం పెదపారుపూడి మండల కేంద్రంలో ఆశ, అంగన్ వాడి, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూలు ఆయాలు, వివోఏలు, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు వేము పెదబాబు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోర్డులను రద్దు చేయాలని, ఉపాధి హామీ చట్టంలో మార్పులను వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, విత్తన బిల్లును, విద్యుత్ సవరణ బిల్లులను వెనక్కి తీసుకోవాలని, వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏకపక్షంగా కార్మిక, కర్షక, ఉద్యోగ ప్రజా వ్యతిరేక చర్యలు దూకుడుగా అమలు చేయటానికి ప్రయత్నిస్తోందని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రోజులలో పెద్ద ఎత్తున పోరాటాలు సాగించాల్సి వస్తుందని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు కన్వీనర్ ఉప్పలపాటి అనూష. టి.అబ్రహం, దానియేలు, పి.కృష్ణ, వాణి, పద్మశ్రీ, విజయ కుమారి, విజయ, రమణమ్మ, మధు, రమ, వృత్తి సంఘాల నాయకులు జిల్లా కార్యదర్శి కె.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# దేశ వ్యాప్త జాతీయ సమ్మెలో ఎల్ఐసి ఉద్యోగులు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్ఐసి ఉద్యోగులు 2026 ఫిబ్రవరి 12న జరిగే జాతీయ సమ్మెలో పాల్గొన్నారు. గురువారం ఉదయం ఎల్ఐసి డివిజనల్ ఆఫీస్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంను నిర్వహించటం జరిగింది. సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ 'గత దశాబ్ద కాలంగా ప్రభుత్వ రంగ ఎల్.ఐ.సి, సాధారణ బీమా రంగ కంపెనీలను దెబ్బతీయాలని అనేక ప్రయత్నాలు జరిగాయి. 2014 లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల శాతాన్ని 100% దాకా పెంచడం జరిగింది. 2022లో ఎల్ఐసిలో ఐ.పి.ఓ పేరుతో 3.5% వాటాలు అమ్మి, రూ 21 వేల కోట్లు ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుంది. గత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో బీమా చట్ట సవరణ బిల్లు సబ్ కే బీమా, సబ్కీ రక్షా బిల్లు – 2025ను ఏకపక్షంగా ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వం ఆమోదింప చేసుకుంది. దీని వల్ల బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితి 74% నుండి 100% పెరిగింది. బీమా పరిశ్రమలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల అవసరం ఎంత మాత్రం లేదు. కానీ బిజెపి ఆధ్వర్యంలోని వరుస ప్రభుత్వాలు,1999లో 26%, 2015లో 49%, 2021లో 74% విదేశీ పెట్టుబడులకు అనుమతినిచ్చారు. దీనివల్ల విదేశీ పెట్టుబడుదారులకు మన దేశీయ పొదుపు మీద పూర్తి నియంత్రణకు వీలు కలుగుతుంది. 31.03.2024 నాటికి మన దేశ బీమా పరిశ్రమలో విదేశీ ఈక్విటీ రూ.31365.56 కోట్లతో కేవలం 32.67% మాత్రమే ఉన్నది. అంటే 74% గరిష్ట పరిమితి అనుమతించినప్పటికీ, దానిలో సగం కంటే తక్కువగా ఉన్నది. ఈ నేపథ్యంలో ఎఫ్ డి ఐను 100 శాతానికి పెంచవలసిన అవసరం ఏమాత్రం లేదు. దేశీయ పొదుపు దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. సంక్షేమ రాజ్యంగా భారతదేశ రాజ్యాంగపరమైన బాధ్యతలను నెరవేర్చడానికి దేశీయ పొదుపుపై ప్రభుత్వం పూర్తి నియంత్రణను కలిగి ఉండాలి' అని అన్నారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతృత్వంలో బీమా ఉద్యోగులు బీమా చట్ట సవరణలకు వ్యతిరేకంగా, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, క్లాస్ 3,4 నియామకాలు చేపట్టాలని, ఏప్రిల్ 1,2010 తరువాత ఎల్ఐసిలో చేరిన ఉద్యోగులకు 1995 గ్యారెంటీ పింఛను అమలు చేయాలని, 1996 నియామక నోటిఫికేషన్ ప్రకారం ఎల్ఐసిలో చేరిన ఉద్యోగులకు,1995 గ్యారంటీ పింఛను పథకం వర్తింప చేయాలనే డిమాండ్లతో ఫిబ్రవరి12న అల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెలో పాల్గొన్నారు. దేశ ఆర్థిక రంగ పరిరక్షణ కోసం ఈ సమ్మెలో డిమాండ్స్ సాధనలో ప్రజలందరూ భాగస్వాములైసమ్మెకు సంపూర్ణ మద్దతు అందించారని ధన్యవాదములు తెలిపారు. మానవహారం కార్యక్రమం నిర్వహించారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వాసు, కిషోర్ కుమార్, స్వామినాద్, శ్రీనివాసరావు, రత్నా రావు,మాధుర్, సూపర్. ధనుంజయ రావు, నాగయ్య పాల్గొన్నారు.





**పామర్రు మేజర్ న్యూస్ :** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా పామర్రు మండల కేంద్రంలో ఆక్వా రంగం కార్మికులు, ఆశ, అంగన్ వాడి కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, భవన నిర్మాణం, గ్రామపంచాయతీ, ఆటో కార్మికులు, కౌలు రైతులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరిన కార్మికులు ఎన్టీఆర్ సర్కిల్లో బహిరంగ సభ నిర్వహించారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పి.పవన్ కుమార్, మండల కన్వీనర్ ఓ.గంగాధర్ ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పామర్రు మండలం సిఐటియు అధ్యక్షులు ఇంటి రాజు, అంగన్ వాడి జిల్లా నాయకురాలు కె.ఉమారాణి, శివలీల, అంజమ్మ, ఆక్వా కార్మిక సంఘం నుండి జె.శ్రీవిజయ, రమణ, జ్యోత్న, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి లక్ష్మణ, ఒరుగంటి బాబూరావు, ఇటికల చిన్న ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## పమిడిముక్కలలో కార్మికుల నిరసన ప్రదర్శన



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం మండల కేంద్రమైన పమిడిముక్కలలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు శివ నాగేంద్ర, మండల రైతు సంఘం నాయకులు కొల్లి వెంకట్రామయ్య, ఐనంపూడి వెంకటేశ్వరరావు, ఆశ వర్కర్లు డొక్కు కోమలి, మహాలక్ష్మి, శివకుమారి, లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పరమేశ్వరి, ఆనందకుమారి ప్రేమ కుమారి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో అంగన్ వాడి, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తదితరులు నిరసన ప్రదర్శన చేశారు.

## కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలి



**గన్నవరం, మేజర్ న్యూస్ :** కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కొనసాగించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్ళం వెంకటేశ్వరరావు అన్నారు. భారత కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మె లో భాగంగా గురువారం గన్నవరం మండల కేంద్రంలో భారీ ప్రదర్శన సభ నిర్వహించారు. తొలుత

# సార్వత్రిక సమ్మెలో భాగంగా నిరసన ప్రదర్శన చేసిన కార్మికులు

స్థానిక చింతపల్లి పాపారావు భవనం నుండి వందలాది మంది కార్మికుల తో ప్రారంభం అయిన ప్రదర్శన గాంధీ బొమ్మ సెంటర్ నుండి ఆర్టీసీ బస్టాండ్, రైతు బజారు వరకు వెళ్లి తిరిగి గాంధీ బొమ్మ సెంటర్ నుండి అంబేద్కర్ సెంటర్ మీదగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లంపల్లి ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు ఎం ఉమా మహేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ బాధ్యులు పిల్లి మహేశ్వరరావు (మహేష్), కాట్రగడ్డ రామచంద్ర జోషి మాట్లాడారు. ఈ కార్యక్రమం లో బిల్డింగ్ వర్కర్స్, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, విఓఎలు, గ్రామ పంచాయతీ, మఠా, సివిల్ సప్లై, రిక్షా, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు మరియదాసు, నాగలక్ష్మి, స్వాతి, భవాని, వీరమ్మ, సమ్మక్క లలితకుమారి, పద్మ, గణేష్, చిన రాజు, శ్రీనివాస్, వీరంకి శ్రీనివాస్, ఓ శివ శంకర్, ఆవుటపల్లి సాంబయ్య, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. సూరంపల్లి పారిశ్రామిక కేంద్రంలో పరిశ్రమలు అన్నీ మూత పడగా పెద్ద సంఖ్యలో కార్మికులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో బెజవాడ తాతబ్బాయి, కె ఏసుదాసు, బి కొండలు, నాగరాజు, రమేష్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల జోలికొస్తే ప్రభుత్వాలు ఇంటికే..




**వత్సవాయి మేజర్ న్యూస్:** మండలం లోని జిల్లా పరిషత్ హై స్కూల్ నుండి గాంధీ పార్క్ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. అనంతరం గాంధీ పార్క్ సెంటర్ వద్ద నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.రాము అంగన్వాడి ప్రాజెక్టు యూనియన్ కార్యదర్శి ఈ మధు కుమారి, ఆశ యూనియన్ జి నాగేశ్వరి, ఎల్ఐసి యూనియన్ నాయకులు పి.లక్ష్మీనారాయణ, రైతు సంఘం నాయకులు మండేపూడి చంద్రశేఖర్, కౌలు రైతు సంఘం నాయకులు జిల్లా నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు మధ్యాహ్నం భోజనం పథకం అంగన్వాడి, ఆశ యూనియన్ నాయకురాలు విశాలాక్షి, జానమ్మ, జానకి, సుజాత, శైలజా, కిరణ్ కుమారి, నాయకురాలు ఏ ఈశ్వరమ్మ ముఠా వర్కర్ యూనియన్ నాయకులు నాయకులు వై వెంకటేశ్వర్లు ఆర్ దేవయ్య, ఆర్ రాజు తదితరులు కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కార్మికులు భారీగా ర్యాలీ

**రెడ్డిగూడెం, మేజర్ న్యూస్ :** రెడ్డిగూడెం మండలంలో కార్మికులు గురువారం నాడు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అమర్ భవన్ నుంచి పెట్రోల్ బంక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ఎం.మాధవరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు, ఆశా వర్కర్స్ యూనియన్ వరలక్ష్మి, తిరుపతమ్మ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ టీ.వి.లలిత కుమారి, ఎన్.కుమారి, సిపిఎం మండల కార్యదర్శి టి.వీరస్వామి, సిపిఎం జర్నలిస్టుల యూనియన్ నాయకులు సిహెచ్.విజయ కుమార్, సీఐటీయూ మండల అధ్యక్షులు కె.పరమేశ్వరరావు, రైతుసంఘం నాయకులు ఎం.మాధవరెడ్డి, వి.కృష్ణ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, సీఐటీయూ ఉపాధ్యక్షులు నాగరాజు, అంగన్వాడీ, ఆశా, బిల్డింగ్ వర్కర్స్, మధ్యాహ్నం భోజన కార్మికులు, రైతు సంఘాలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతమైన సార్వత్రిక సమ్మె

**మొవ్వ మేజర్ న్యూస్ :** కేంద్ర కార్మిక సంఘాలు, రైతు కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుతోగురువారం నిర్వహించిన సార్వత్రిక సమ్మె మండలంలో విజయవంతమైంది. ఏఐటీయుసి, సిఐటియు, సిపిఐ, సిపిఎం, పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సార్వత్రికసమ్మెకు టిడిపి, వైసిపి నేతలు పలువురు పాల్గొనడంతో సమ్మె నిర్వహణకు మరింత బలం చేకూరింది. మోడీ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడం కోసం నిర్వహించిన ఈసమ్మెలో పాల్గొన్న పామర్రు నియోజకవర్గ సిపిఐ సమితి కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు మాట్లాడుతూ వివిధ శాఖల కార్మికులందరూ ఐక్యంగా పోరాటానికి రావటం శుభ సూచకమనిపేర్కొన్నారు. మొవ్వలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావుతోపాటు పామర్రు నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘాలు అధ్యక్ష కార్యదర్శులు బోరుకాటి.నరసింహారాజు, చందోలు.నాగేశ్వరరావు, ఏఐటీయుసిమండల కార్యదర్శి గోగినేని. సోమశేఖర రావు,సభ్యులు సూరిబాబు సత్యనారాయణ, సిపిఐ కూచిపూడి శాఖ కార్యదర్శి కొండా. నాగేశ్వరరావు, సభ్యులుప్రాకెర్ల.మెహరాలి రాజు, గోవాడ.రాము, తదితరులు పాల్గొన్నారు. అలాగే సిపిఎం పార్టీ మండల కార్యదర్శి శీలం. నారాయణరావు, నాయకులు కొడాలి.శ్రీనివాసరావు, చిగురుపల్లిసుబ్రహ్మణ్యం, బొల్లాసుబ్రహ్మణ్యం, శీలం. కాటయ్యలతోపాటు టిడిపి నేతలుతాతినేని.పూర్ణచంద్రరావు, శీలం.బాబురావు ఆశా వర్కర్స్, అంగన్వాడీ కార్యకర్తలు, కౌలు రైతులు, బిల్డింగ్ వర్కర్స్, ముఠా వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా వీరికి ఎన్జీవో అసోసియేషన్ మొవ్వ యూనిట్ భోజనం విరామ సమయంలో వచ్చి సార్వత్రిక సమ్మెకు మద్దతు ప్రకటించారు.

## బి.జె.పి. కార్మిక వ్యతిరేక విధానాలపై ర్యాలీ

**మొవ్వ మేజర్ న్యూస్ :** ఏ.ఐ.టీ.యు.సి, సి.ఐ.టి.యు.ల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు నిర్వహించిన సార్వత్రిక సమ్మె విజయవంతం కావడంతోపాటు నిర్వహించిన ర్యాలీకి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా అరుణపతాకాల రెపరెపలతో కాజ పురవీధులు కళకళలాడాయి. అంగన్వాడి సిబ్బంది, ఆశా వర్కర్స్, చేనేత కార్మికులు, కౌలు రైతులు ప్రదర్శనలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సమితి నియోజకవర్గ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి చందోలు నాగేశ్వరరావు, సిపిఐ అనుబంధ సంస్థ అయిన చేనేత కార్మికులు నందం వెంకటేశ్వరరావు, కోడాటి ఈశ్వర ప్రసాద్, కోడాటి దుర్గారావు, కోడాటి వెంకటేశ్వరరావు, నందం నరసింహారావు, సిపిఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు, సిపిఎం అనుబంధ సంస్థల నేతలు కొడాలి కరుణాకర రావు, ఆర్ మురహరరెడ్డి,చిగురుపల్లి సుబ్రహ్మణ్యం, తదితరులతోపాటు అంగన్వాడి, ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు పలువురు పాల్గొన్నారు. అలాగే నిడుమోలు లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అనుబంధ సంస్థల నేతల పర్యవేక్షణలో ర్యాలీ ధర్నా నిర్వహించారు.

# పార్టీ బలోపేతం కావడంలో కార్యకర్తల పాత్రే కీలకం...



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** పార్టీ బలోపేతం కావడంలో ప్రతి కార్యకర్త పాత్ర అత్యంత కీలకమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి ప్రజలతో బలమైన అనుబంధం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా గ్రామ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన ఆయన మండల పరిధిలోని వెంట్రప్రగడ గ్రామంలో పర్యటించారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో ఓటమి చెందినా ప్రజా క్షేత్రంలో ప్రజల కోసం, వైఎస్సార్ కార్యకర్తల కోసం పూర్తి సమయాన్ని కేటాయిస్తున్న అనిల్ కుమార్ ప్రస్తుతం పార్టీ బలోపేతంపై దృష్టి సారించారు. కూటమి ప్రభుత్వ వరుస వైఫల్యాల నేపథ్యంలో ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తూనే, గ్రామస్థాయిలో వైఎస్సార్ సీపీ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా చేసుకున్నట్లు ఈ సందర్భంగా అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలంగా నిలబెట్టే విధంగా స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అనంతరం వెంట్రప్రగడ గ్రామంలో సంబంధించిన కొత్త వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ప్రకటించారు. పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేస్తూ, భవిష్యత్తు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామ పార్టీ అధ్యక్షులుగా జాజుల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శులుగా చీకుర్తి రవి కుమార్, బుజ్జి వరపు నారాయణ, నూకల సాయి బాబు, జ్వాల ప్రభుదాసు లను అనిల్ కుమార్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గోగం సురేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న లేగదేడల ప్రదర్శన



చల్లపల్లి మేజర్ న్యూస్: పశుగణాభివృద్ధి సంస్థ, ఏపీ పశుసంవర్ధకశాఖ, పశు గణాభివృద్ధి సంఘం, రాష్ట్రీయ గోకుల్ మిషన్ల ఆధ్వర్యంలో చల్లపల్లి మండలం లక్ష్మీపురం పశువైద్యశాలలో గురువారం లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం జరిగింది. 40 లేగదూడలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. లేగ దూడలే రేపటి పాడి పశువులని, దూడల పెంపకంలో తగు సూచనలు, సలహాలు అందచేశారు. చిగురుపల్లి పాపారావు, ఎడ్లపాటి మ ఎక్తేశ్వరరావు, దోనేపూడి నరసింహారావుల లేగదూడలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించాయి. అంబటి భువనేశ్వరరావు దూడలకు ప్రత్యేక బహుమతి లభించగా, విజేతగా నిలిచిన లేగదూడల రైతులకు, పోటీలో పాల్గొన్న పాడిరైతులకు కన్సొలేషన్ బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి ఏడీ డాక్టర్ కెసివి.రెడ్డి, మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం. నందకిషోర్, గన్నవరం డీఎల్డీఏ డాక్టర్ పి.రాధికలు పాల్గొని పాడిరైతులకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమ టలో వీఎలీలు, జేవీఏలు, ఎల్ఎస్ఏలు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. దూడల పెరుగుదలకు మం దులను ఉచితంగా అందించారు.

## .విద్యా ఉపకరణలు పాఠశాలకు బహుకరణ

**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని పెదసనగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు, పెదసనగల్లు మాతృ భూమి సంఘం నిర్వాహకులు 80 వేల రూపాయల విలువగల విద్యా ఉపకరణాలను



గురువారం పాఠశాలకు బహుకరించారు. రెండు బీరువాలు, ఐదు కుర్చీలు, క్రీడా పరికరాలు, ప్రయోగశాల పరికరాలు, గడ్డి కత్తిరించే యంత్రం ప్రధానోపాధ్యాయులు వడ్డీ. వెంకటసంజీవరావుకు అందజేశారు. అలాగే పాఠశాల అభివృద్ధికి లక్ష రూపాయలను డాక్టర్ కూచిపూడి శరత్చంద్ర, చీకటిమర్ల బాబు రాజేంద్రప్రసాద్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పదివేలు, దేవినేని రాణి ప్రమీల 5 వేలుఅందజేశారు. ఈ కార్యక్రమంలో మాతృభూమి శ్రేయోసంఘం బాధ్యులు కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్(విజయవాడ) క్లినిక్ వైద్యాధికారి డాక్టర్ సూరపునేని.సత్యనారాయణ ప్రసాద్, మహారాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డు రిటైర్డ్ డివిజనల్ ఇంజనీర్ శిరిపురపువెంకటేశ్వ రరావు(రావు), ఏ.జీ అండ్ ఎస్.జి.సిద్ధార్థ డిగ్రీ కాలేజీ (ఉయ్యూరు) కెమిస్ట్రీ విభాగ విశ్రాంత విభాగాధిపతి సూరపనేని వెంకట కృష్ణారావు, డాక్టర్ కూచిపూడి శరత్ బాబు(ఎన్నారై), డాక్టర్ సూరపనేనిరమేష్ చంద్ర, డాక్టర్ సూరపనేని రవీంద్రనాథ్ ఠాగూర్, విద్యా కమిటీ చైర్మన్ ఏ నాగేంద్రరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సెలవైన పన్ను చెల్లింపులకు క్యాష్ కౌంటర్లు అందుబాటులో..

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ది. ఫిబ్రవరి 14, 2026, రెండవ శనివారం సెలవు దినము అయినప్పటికీ పన్ను చెల్లింపులకు విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో గల 13 కాష్ కౌంటర్లు అందుబాటులో కలవు అని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం నాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 14, 2026 శనివారం సెలవు దినము అయినప్పటికీ, ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, డ్రైనేజీ పన్ను, నీటి పన్ను చెల్లింపులకు ప్రజల సౌకర్యార్థం నగరపాలక సంస్థ పరిధిలో గల 13 క్యాష్ కౌంటర్లు అందుబాటులో ఉంటాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పన్ను చెల్లింపులు చేసుకోగలరని కోరారు.



## టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

**మోపిదేవి మేజర్ న్యూస్ :** టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ కోరారు. గురువారం సాయంత్రం మోపిదేవిలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో పరీక్ష సామాగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. టీడీపీ అవనిగడ్డ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో ఐదు మండలాల్లోని ఏడు సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉన్న వంద మంది టెన్త్ విద్యార్థులకు పరీక్ష అట్టలు, నోట్ బుక్స్, కిట్స్ సమకూర్చారు. ముఖ్య అతిథిగా వెంకట్రామ్ విచ్చేసి పంపిణీ ప్రారంభించారు. అనంతరం వసతి గృహంలోని వంద మంది విద్యార్థులకు ఉమ్మడి రాష్ట్ర మాజీ విద్యా శాఖ మంత్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సందర్భంగా గ్రామీణ యువజన వికాస సమితి ఆధ్వర్యంలో వంద మంది విద్యార్థులకు పరీక్షల అట్టలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో సంక్షేమ హాస్టళ్ళ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ప్రభుత్వ సహకారం, దాతల ప్రోత్సాహం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాధ్, వీఆర్ఓ నాగ మల్లేశ్వరరావు, ఏ.ఎస్.డబ్ల్యూ.ఓ సుల్తానా, గ్రామీణ యువజన వికాస సమితి సభ్యులు నున్న సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ శ్రీను, గుర్విందపల్లి అనీల్, వసతి గృహాల సంక్షేమ అధికారులు శివ నాగలక్ష్మి, సయ్యద్ షకూర్, సురియా బేగం, వనజ కుమారి, నటరాజరాణి, కొండపల్లి వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రూప్ - 1 విజేత భానుప్రకాష్‌కు చల్లపల్లిలో ఘన సన్మానం

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** అవనిగడ్డకు చెందిన ప్రముఖ న్యాయవాది నరహరశెట్టి ఈశ్వరరావు నగరాజకుమారి (టీచర్)ల కుమారుడు భాను ప్రకాష్ గ్రూప్-1 ఫలితాల్లో విజేతగా నిలిచి స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమీషనర్గా ఎంపికైన సందర్భంగా చల్లపల్లి ఉపసర్పంచ్ మ ఎమ్మనేని నాని ఆధ్వర్యంలో చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో గురువారం సాయంత్రం ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా భానుప్రకాష్ సాధించిన విజయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ యువకుడిని అభినందించి రానున్న రోజుల్లో సివిల్స్ రాసి విజయం సాధించాలని కోరారు. విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, తహసీల్దార్లు శ్రీలత, కె.మస్తాన్, విజయప్రసాద్, ఆర్ఐ కృష్ణ మోహన్, వైస్ఎంపీపీ రాంబాబు, కార్పోరేషన్ డైరెక్టర్ నాగమణి, ఎంపీటీసీ ద్వారకానాథ్, టీడీపీ నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, మోర్ల శివ, షేక్ నబీఘోరి, సీపీఐ నేతలు ప్రసాద్బాబు, సురేంద్రనాథ్బనర్జి, ఈవో పి.వి.మాధవేంద్రరావు, ప్రమకులు జివి.తాతారావు, ఏఎల్ఆర్ కె.ప్రసాద్, మీర్ రిజ్వాన్, కైతేపల్లి దాస్, బుల్లా కిషోర్, మదుసూధనరావు, తుటారం ప్రసాద్, ప్రెస్ పూర్ణలతోపాటు వివిధ వర్గాల ప్రముకులు, అధికారులు, పెద్దలు పాల్గొని భానుప్రకాష్, తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు.

## మహాశివరాత్రికి పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవాలయాల వద్ద పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని విశ్వహిందూ పరిషత్ కృష్ణాజిల్లా దుర్గా వాహిని అధ్యక్షురాలు అంబటి తులసి వసుంధర గురువారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు రానున్న మహాశివరాత్రి నీ పురస్కరించుకొకి విశ్వహిందూ పరిషత్ కృష్ణాజిల్లా లోని ప్రఖండ, ఖండ, సభ్యులు కార్యకర్తలు జిల్లావ్యాప్తంగా కృష్ణానదికి ఇరువైపులా పరివాహక ప్రాంతాలలో ప్రముఖ పుణ్యక్షేత్రాలుగా విరాజల్లుతున్న దక్షిణ కాశీగా పేరొందిన పెద కళ్ళేపల్లి, పాత ఎడ్లంక, సంగమేశ్వరం పుణ్యక్షేత్రాల వద్ద కృష్ణానది స్థానఘాట్ ల వద్ద ప్రమాదాలు జరగకుండా పట్టుదిట్ట మైన ఏర్పాట్లు చేయడంతో పాటు మహిళలకు మరుగు దొడ్లు వృద్ధులను వికలాంగులను దైవ దర్శనంకు తీసుకు వెళ్ళటం వంటి ఏర్పాట్లు చేయాలని, దేవాలయాలకు వచ్చే భక్తులకు తాగునీరు ఏర్పాటు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు హిందూ భక్తులకు ప్రసిద్ధి శివాలయాలకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటుకు ఆర్టీసీ డివిజన్ మేనేజర్ ను కలిసి ఫ్రీ బస్సులు ఏర్పాటు చేయాలని ఆమె కోరినట్లు చెప్పారు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ తమ శక్తి కొలది సహాయ సహకారాలు అందజేయాలని వసుంధర కోరారు.

## అవనిగడ్డలో సమ్మె సంపూర్ణం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** జాతీయ జాతీయ ట్రేడ్ యూనియన్ సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు అవనిగడ్డలో సమ్మె సంపూర్ణంగా జరిగింది. సిఐటియు నాయకులు పోలినాయుడు ఆధ్వర్యంలో గురువారం ఉదయం నుండి కార్మిక సంఘాలు తమ విధులను బహిష్కరించి స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల నుండి బయలుదేరి రాజీవ్ గాంధీ సెంటర్ వరకు ర్యాలీగా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు కార్యదర్శి ఎన్. అర్జున్ రావు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎర్రంశెట్టి. రమాదేవి, అంగన్వాడి యూనియన్ నాయకులు పాతూరి. గాయత్రి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి యాసం. శ్రీనివాసరావు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్. కృష్ణ, తదితర కార్మిక ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

### అవనిగడ్డ ఎల్ఐసి కార్యాలయం వద్ద సమ్మె

ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతృత్వంలో బీమా ఉద్యోగులు బీమా చట్ట సవరణలకు వ్యతిరేకంగా అవనిగడ్డ ఎల్ఐసి కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని నిర్వహించారు. డివిజన్ యూని యన్ కోశాధికారి ఎమ్మెస్ ఎం ప్రసాద్, అవనిగడ్డ బ్రాంచ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సుభాన్, నాగ శశిధర్, ఎండి ఇర్ఫాన్, ఫణి రాజు, ఫోన్ ఎక్స్, జోగి శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు. లియాఫీ ఏజెంట్ యూనియన్ నాయకులు నిరంజన్ రావు, అంబటి వెంకటేశ్వరరావు, కిషోర్ బాబు, సిఐటియు నాయకులు పాల్గొని ప్రసంగించారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారీ వర్గాలకు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సిపిఐ కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు పేర్కొన్నారు. అఖిల భారత సార్వత్రిక సమ్మెలో భాగంగా చల్లపల్లి భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అడ్డాడ ప్రసాద్ బాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్ర నాథ్ బెనర్జీ మాట్లాడుతూ దోపిడికి గురవుతున్న బాధ్యత కార్మిక వర్గం రైతు కూలీలు గిరిజనులు ఏకమై శ్రామిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. తోలుత కార్మికులు, నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య జిల్లా నాయకులు మల్లు పెద్ది రత్నకుమారి కంఠంనేని జోత్స్నా దేవి, సిపిఐ అవనిగడ్డ నియోజకవర్గం కార్యదర్శి గుత్తికొండ రామారావు, పార్టీ నాయకులు చంద్ర సుబ్బారావు, కొర్రపాటి ముఖర్జీ, అల్లూరి బాబురావు, కొల్లూరి శ్రీధర్, నక్క శ్రీనివాసరావు, పెనుమత్స ప్రభాకర్ రావు, గంగాధర రావు, సిపిఎం నాయకులు యద్దనపూడి మధు, మొహమ్మద్ కరీముల్లా, ఎం ఎల్ పార్టీ నాయకులు జన్ను జగన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మీర్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

## కోడూరు సిఐటియు నిరసన ర్యాలీ



**కోడూరు మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కోడూరులో సి ఐ టీ యూ ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు కోడూరు వంతెన సెంటర్ నుంచి ప్రధాన సెంటర్ వరకు ఉద్యోగులు కార్మికులు భారీగా తరలివచ్చారు నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని అంటూ నినాదాలతో పట్టణాన్ని హోరెత్తించారు ప్రభుత్వ విధానాల వల్ల కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజాసంఘాల నేతలు వివరించారు.

# భక్తుల భద్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

- మహా శివరాత్రి సందర్భంగా అప్రమత్తంగా ఉండాలి
- అధికారులు పటిష్ట సమన్వయంతో పనిచేయాలి
- ఎగ్జిబిషన్లకు డెయిలీ ఫిట్‌నెస్ చెకింగ్ రిజిస్టర్ ఉండాల్సిందే
- అత్యంత నాణ్యంగా అన్న, ఇతర ప్రసాదాలు అందించాలి
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ఎన్‌టీఆర్ జిల్లా, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్ :** జిల్లావ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులకు సూచించారు. కలెక్టర్ లక్ష్మీశ గురువారం క్యాంపు కార్యాలయం నుంచి దేవాదాయ శాఖ అధికారులతో పాటు వివిధ ఆలయాల ఈవోలు, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రతలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంతో పాటు జిల్లా వ్యాప్తంగా శివాలయాలకు పెద్దఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో ప్రణాళికాయుత చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణానదీ తీరంలోని దుర్గాఘాట్, పున్నమి ఘాట్, భవానీ ఘాట్, పవిత్ర సంగమం వంటి ప్రాంతాల్లో భక్తులు భారీ సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించే అవకాశం ఉన్నందున ఈ నెల 14, 15 తేదీల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఘాట్ల వద్ద, క్యూ లైన్లలో నిరంతరం పహారా కాయాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు భక్తుల భద్రతకు ప్రాధాన్యత నిస్తూ నిఘా ఉంచాలని పోలీసు శాఖకు సూచించారు. బ్యారికేడింగ్, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ఘాట్ల వద్ద నిరంతర పారిశుధ్య పనులు చేపట్టాలని, భక్తులకు తాగునీరు, మొబైల్ టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు.

విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని, వివిధ ఆలయాల్లో ముఖ్యంగా రద్దీ సమయాల్లో తొక్కి సలాట వంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన ఘాట్ల వద్ద మెడికల్ క్యాంపులు, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పండగ రోజుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, ఘాట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. భక్తుల రక్షణను దృష్టిలో ఉంచుకొని 15 మంది శిక్షణ పొందిన గజ ఈతగాళ్లను మూడు షిఫ్టులలో ఘాట్ల వద్ద అందుబాటులో ఉంచాలని మత్స్య శాఖాధికారిని ఆదేశించారు. ఎక్కడైనా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసినట్లయితే తప్పనిసరిగా వాటికి డెయిలీ ఫిట్‌నెస్ చెకింగ్ రిజిస్టర్లను నిర్వహించాలని ఆదేశించారు.

అగ్ని ప్రమాదాలు జరక్కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని.. సీసీటీవీ, డ్రోన్లను కూడా ఉపయోగించాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌లు కూడా ఏర్పాటు చేయాలన్నారు. మహిళా భక్తులు, చిన్నపిల్లలు, వయోవృద్ధుల భద్రతపై ప్రత్యేకంగా దృష్టిసారిం చాలన్నారు. అన్న ప్రసాదంతో పాటు లడ్డూ ప్రసాదాలను అత్యంత నాణ్యతతో అందించాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్ ఎన్.షణ్ముగం, ఆర్‌డీవోలు కె.బాలకృష్ణ, కె.మాధురి, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన జనార్దన్



**వత్సవాయి ఫిబ్రవరి 12 మేజర్ న్యూస్ :** వత్సవాయి మండలం లింగాల గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా పవిత్ర మున్నేటి ఒడ్డున ఉన్న చిన్న శ్రీశైలంగా పేరుగాంచిన గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి వారి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను రాజకీయ కార్యదర్శి తెలుగు దేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్, జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ పరిశీలించారు ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ ఏర్పాట్లు, భక్తులకు జల్లు స్నానం సౌకర్యాలు, పితృదేవతలకు పిండ ప్రదానం చేసే స్థలాలను ఆయన పరిశీలించి నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు.

## ఆర్ముడు రిజర్వ్ పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఫైరింగ్ ప్రాక్టీస్





**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** ఏఆర్ పోలీస్ అధికారులకు, సిబ్బందికి నిర్వహిస్తున్న వార్షిక మొబిలైజేషన్లో భాగంగా గురువారం మంగినపూడి బీచ్ వద్దగల ఫైరింగ్ రేంజ్‌లో జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు,ఆదేశాల మేరకు ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. పోలీసులు తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పూర్తి స్థాయి పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ బి. సత్యనారాయణ తెలిపారు.జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వార్షిక మొబిలైజేషన్ ఫైరింగ్ సాధన ప్రక్రియలో భాగంగా నిర్వహించిన వార్షిక ఫైరింగ్ లో అక్కడ జరుగుతున్న ఫైరింగ్ ప్రక్రియను పరిశీలించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఫైరింగ్ సాధన ప్రక్రియలో ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ పాల్గొని, ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్న అధికారుల్లో ఉత్సాహం, మనోధైర్యాన్ని నింపారు. ఈ ఫైరింగ్‌లో ప్రతి అధికారి, సిబ్బంది తప్పనిసరిగా పాల్గొని మంచి మెళకువలు నేర్చుకోవాలని, ఫైరింగ్‌కు సంబంధించి ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఫైరింగ్ రేంజ్‌లో క్రమశిక్షణ అత్యంత ప్రాముఖ్యత వహిస్తుందని, ఫైరింగ్ రేంజ్ అధికారుల సూచనల మేరకు అత్యంత జాగ్రత్తగా, ఏకాగ్రతతో ఫైరింగ్ చేయాలన్నారు. ప్రతి ఒక్క బుల్లెట్ లక్ష్యాన్ని ఖచ్చితంగా చేదించే నైపుణ్యం పొందాలని సూచించారు.కొత్తగా వచ్చిన ఆయుధాలపై పూర్తి స్థాయి తర్ఫీదు పొందుతూ, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల, ప్రభుత్వ ఆస్తుల, ధన, ప్రాణాల రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు అత్యంత కీలకమని, అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించి జిల్లా పోలీసు శాఖ ఉన్నతి సాధనలో ఎల్లప్పుడూ ముందడుగు వేయాలని సూచించారు.

## ఉద్యోగం కల్పించటమే జాబ్ మేళా ముఖ్య ఉద్దేశం



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించుటయే జాబ్ మేళా ముఖ్య ఉద్దేశం అని విజయవాడ నగరపాలక సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ (యుసిడి) ఎం విజయలక్ష్మి అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జాబ్ మేళా ను ప్రారంభించారు. ఈ జాబ్ మేళాలో 700 అభ్యర్ధులు రాగా 340 దరఖాస్తులు చేసుకున్నారని 60 అభ్యర్థులు ఉద్యోగం పొందారని నగరపాలక సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ (యుసిడి) ఎం విజయలక్ష్మి అన్నారు. అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్లో భాగంగా నిరుద్యోగులకు ఉద్యోగాన్ని కల్పిస్తూ వారికి ఆర్థికంగా బలోపేతం చేయటమే లక్ష్యమని నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ ఇటువంటి విషయాలపై కృషి చేస్తుందని. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఎక్స్పర్ట్ సుజాత, యుసిడి సిబ్బంది పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న మాజీ డీజీపీ



**మోపిదేవి మేజర్ న్యూస్ :** తెలంగాణ మాజీ డీజీపీ జితేందర్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సుప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా భాసిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. సతీసమేతంగా దేవస్థానానికి వచ్చిన ఆయన సర్ప దోషం నివారణ పూజ కార్యక్రమం నిర్వహించి, స్వామి వారి నాగ పుట్టలో పాలు పోశారు. గర్భాలయంలో కొలువై ఉన్న స్వామిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. వీరికి ఆలయ సూపరిడెంట్ అచ్యుత మధుసూదనరావు సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలు అందచేశారు.

## గుడి..బడి..కాలేజీ.. నివాస ప్రాంతాల మధ్య వైన్స్ షాపును ఏర్పాటు ఎలా?




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం 49వ డివిజన్ ఈడేపల్లి బైపాస్ రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న వైన్ షాప్ తొలగించాలని 49వ డివిజన్ ప్రజలు జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ & ప్రొహిబిషన్ సూపర్నెంట్ సి భార్గవకి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివాసాల ప్రాంతంలో ఐటిఐ కాలేజీ, ప్రభుత్వ పాఠశాల ఉన్నాయని వైన్ షాపు ఏర్పాటు చేస్తే ఇక్కడ విద్యార్థులకు పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని వారు వివరించారు. అదే ప్రాంతంలో ఆంజనేయస్వామి గుడి., వనములమ్మ గుడి. ఉందని భక్తులు చాలామంది. ఈ గుళ్ళకు వెళతారని మద్యం సేవించిన వారితో పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ముందు ముందు ఉందని ప్రజలు అంటున్నారు. విద్యార్థుల భవిష్య దృష్టిలో పెట్టుకొని ఉన్నత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వైన్ షాపును వేరే ప్రాంతానికి తరలించాలని వారు అధికారులను కోరారు. అనంతరం కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కి కూడా వినతి పత్రం అందజేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ వినతి పత్రాన్ని కృష్ణాజిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సూపర్నెంట్ జి గంగాధర్ రావుకి అందజేస్తానని తెలిపారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999